సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



అంతులేని విషాదం - 8లో

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్సియా పరిశ్రమలో బుధవారం జరిగిన దుర్ఘటనలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ముగ్గురు మృతిచెందారు.



అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని మన్యం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. - 8లో

గ్రామ సభలు నిర్వహించండి

పార్వతీపురం: ఉపాధిహామీ పనుల ఆమోదం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారులు వీలున్నంత ఎక్కువ గ్రామ సభలకు హాజరుకావాలని సూచించారు. గ్రామ సభలను వీడియోగ్రఫీ చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా, సభలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టబోయే పనులను తెలియజేయాలన్నారు.

న్యూస్‌రీల్

ఎంఎన్‌సీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

పార్వతీపురంటౌన్: జెన్ ప్యాక్ట్ బహుళ జాతి కంపెనీ (ఎంఎన్‌సీ)లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్ వాయిస్ సపోర్ట్ విభాగాలలో 1500 ఖాళీల భర్తీకి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉద్యోగాలకు 2022, 2023, 2024 సంవత్సరాల్లో బీటెక్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో హెచ్‌ఆర్, టెక్నికల్ రౌండ్లు ఉంటాయన్నారు. ఉద్యోగాలు హైదరాబాద్ హాఫీజ్‌పేట్‌లో రొటేషన్ షిఫ్టుల్లో అందుబాటులో ఉంటాయని, ఆసక్తిగల అభ్యర్థులు ఆగస్టు 28వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఆసక్తి గల యువత హెచ్‌టీటీపీఎస్://బిట్.ఎల్‌వై/46డబ్ల్యూజెడ్‌క్యూజెడ్6 లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీ, స్థలాన్ని తెలియజేస్తామన్నారు. సమాచారం, సందేహాలకు సెల్: 63012 75511, 94947 77553 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నేడు మంత్రి సత్యకుమార్ యాదవ్ రాక

విజయగరం అర్బన్: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఉమ్మడి విజయనగరం జిల్లాకు రానున్నారు. వేకువజామున 4.20 గంటలకు రైలులో నగరానికి చేరుకుంటారు. ఉదయం 8.30 గంటలకు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం బయలుదేరి వెళతారు.

వేగవంతంగా గిరిజన వర్సిటీ పనులు

- విజయనగరం కలెక్టర్ అంబేడ్కర్
- వర్సిటీ పనులపై సమీక్షించిన ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి

విజయనగరం అర్బన్: మెంటాడ మండలం చిన్న మేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల వద్ద నిర్మించనున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ పనులను వేగవంతం చేస్తామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి సౌరవ్‌గౌర్ వీడియో కాన్ఫరెన్స్‌లో వర్సిటీ పనులపై గురువారం సమీక్షించారు. వచ్చే మార్చి నాటికి అకడమిక్ బ్లాక్స్, హాస్టల్స్ ప్రారంభం కావాలని, ఆ మేరకు జిల్లా యంత్రాంగం పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, విద్యుత్ సరఫరాకు రూ.3.6 కోట్లు మంజూరు చేయాలని కోరారు. నీటి సరఫరా కోసం రూ.4 కోట్లు మంజూరు చేయాలని, ఇప్పటికే రూ.3 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఆరులైన్ల సీసీ రోడ్డు ల్యాండ్ ఎక్విజిషన్ కోసం రూ.2.6 కోట్లు అవసరమని వివరించారు. సీసీ రోడ్డుకు సంబంధించిన 5.41 ఎకరాలపై ప్రైవేట్ ల్యాండ్ ఓనర్స్ హైకోర్టులో రిట్ వేశారని, పరిష్కారం కావాల్సి ఉందన్నారు. లేదంటే ప్రత్యామ్నాయ మార్గం గుర్తిస్తామని చెప్పారు. వర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు తయారులచేయాలని డీఆర్వో అనితకు కలెక్టర్ ఆదేశించారు.

ప్రాణాలు నిలిపే డాక్టరమ్మకు.. భద్రత బెంగ!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఊరి మధ్యలోని ఆలయం ఓ నమ్మకమైతే.. ఊరి శివారున ఉండే ఆస్పత్రి ఆరోగ్యానికి, ఆయుష్షుకు భరోసా. ఆ రెండు చోట్ల విధులు నిర్వర్తించేవారిని దేవుళ్లకు ప్రతిరూపంగా చూస్తాం. కొందరు మానవమృగాలుగా మారి.. ఆ ప్రతిరూపాలకే హానితలపెడుతున్నారు. తలదించుకునేలా అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఆయుష్షు పోసేవారి ఆయుష్షు తీసేస్తున్నారు. సభ్యసమాజం తల దించుకునేలా చేస్తున్నారు. వైద్యులు, సిబ్బందికి రక్షణ ప్రశ్నార్థకమైన వేళ... వైద్య దళం గళమెత్తింది. వీరి ఆందోళనపై దేశ అత్యున్నత న్యాయస్థానమూ స్పందించింది. ఆస్పత్రుల్లోని భద్రతా చర్యలను ప్రశ్నించింది. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆస్పత్రుల నిర్వహణ తీరు, అక్కడ పనిచేసేవారికి కల్పించాల్సిన సదుపాయాలు, వైద్యసేవలు అందజేయడంలో వైద్యులు, సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులకు 'సాక్షి' అక్షర రూపం.

- పనిచేసే చోట వైద్యులకు, సిబ్బందికి రక్షణ కరువు
- కనీస సదుపాయాలు లేకనే ఆకతాయిల ఆగడాలు
- రాత్రి వేళ్లలో విధులు నిర్వహిస్తున్న వారి పరిస్థితి మరీ దయనీయం



పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో రోగులకు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్/పాలకొండ రూరల్/గుమ్మలక్ష్మీపురం/సాలూరు రూరల్: కోల్‌కతా ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటన యావత్ దేశాన్ని కుదిపేసింది. ప్రస్తుతం ఉన్న చట్టాలు వైద్యులు, వైద్యసిబ్బందికి భద్రతా వాతావరణాన్ని కల్పించడం లేదని ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. అందరి ప్రాణాలకు భద్రతనిచ్చే వైద్యులకే రక్షణ లేని పరిస్థితులు నేటి సమాజంలో ఉన్నాయన్నది తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు ఆస్పత్రులు, అక్కడి సౌకర్యాలను 'సాక్షి'బృందం గురువారం పరిశీలించింది. చాలా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులకు సరిపడా సౌకర్యాలు లేవు. పటిష్ఠ భద్రత కానరావడం లేదు. సీసీ కెమెరాలు కొన్ని చోట్ల ఉన్నప్పటికీ అందులో పని చేయనివే అధికంగా ఉంటున్నాయి. సాక్షాత్తు వైద్యులు, వైద్య సిబ్బంది మాటల ద్వారానే ఈ విషయం స్పష్టమవుతోంది. ఆస్పత్రుల్లో రక్షణ కోసం ఎటువంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు.



కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని ఖండిస్తూ బొబ్బిలిలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

భయం.. భయంతో...

విధుల్లో ఉంటున్న వైద్య సిబ్బందికి రెస్ట్, వాష్, డ్యూటీ రూమ్స్ ఉండడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో యూనిఫాంతో సెక్యూరిటీ గార్డులు విధుల్లో ఉంటున్నప్పటికీ.. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వద్ద ఆ పరిస్థితి కనిపించడం లేదు. చీకటి పడితే భయంభయంగానే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. పలు చోట్ల హౌస్ సర్జన్‌లు, పీజీ విద్యార్థులు 36 గంటలు.. రెండు, మూడు రోజులు నిరంతరాయంగా విధులు నిర్వహించాల్సి వస్తోంది. కనీసం ఆ సమయంలో అక్కడ సదుపాయాలు కూడా వారికి ఉండవు. భద్రత ఉండటం లేదు.

- అత్యవసర కేసులకు సంబంధించి రోగికి వైద్యం అందిస్తున్న వైద్యులు, సిబ్బంది పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. అదృష్టం కొద్దీ రోగి బతికి బయటపడితే ఫర్వాలేదు,. ఒకవేళ ఏమైనా అయితే, కొన్ని సందర్భాల్లో బంధువులు దాడులు చేస్తున్న సందర్భాలు ఉంటున్నాయి. ఆ సమయంలో అడ్డుకునే భద్రత సిబ్బంది కూడా ఉండటం లేదని వైద్యులు వాపోతున్నారు.
- రాత్రివేళల్లో రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసులు వస్తుంటాయి. అందులో కొంతమంది క్షతగాత్రులతో పాటు.. సహాయకులు మద్యం, ఇతర మాదక ద్రవ్యాల మత్తులో ఉంటున్నారు. చికిత్స అందిస్తున్న సమయంలో మహిళా వైద్యులు, సిబ్బందిపై వెకిలి చేష్టలు, లైంగిక వేధింపులకు పాల్పడటం చోటుచేసుకుంటోంది. ఈ పరిస్థితి మారాలన్నది వైద్యులమాట. ప్రాణాలు పోసే వైద్యులపై సమాజంలో గౌరవం పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ ముక్తకంఠంతో కోరుతున్నారు.



రోగి ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ...



వైద్య సేవలో నిమగ్నమైన వైద్యులు

జిల్లాలో ఉన్న ప్రభుత్వాస్పత్రులు ఇలా..

జిల్లా ఆస్పత్రి:	1
ఏరియా ఆస్పత్రులు:	3
పీహెచ్‌సీలు:	37
సీహెచ్‌సీలు:	3
యూపీహెచ్‌సీలు:	5
మొత్తం మహిళా సిబ్బంది సంఖ్య సుమారు :	950

భద్రత కల్పించాలి



ఆస్పత్రుల వద్ద మహిళా వైద్యులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. విధుల్లో ఉన్న సమయాల్లో భద్రత కల్పించాలి. నివాసగృహాల వద్ద కూడా సదుపాయాలు కల్పించాలి.

– డి.రమ్య, ఈఎన్‌టీ వైద్యులు, భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం

ఒక్కోసారి దాడులు తప్పడం లేదు..



కొన్నిసార్లు రోగుల బంధువుల నుంచి వైద్యులు, సిబ్బంది దాడులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అందరూ వైద్యవృత్తిని దైవంగా భావిస్తారు. రోగికి మంచి జరిగితే ఫర్వాలేదు. వైద్యానికి రోగి శరీరం సహకరించకపోతే కొంతమంది బంధువులు అర్థం చేసుకోరు. వైద్యులదే తప్పు అని నిందిస్తారు. దాడులకు దిగుతారు. ఆస్పత్రుల వద్ద భద్రత పెంచాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి మహిళా వైద్యులు, సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించాలి. వేధింపులకు తావులేకుండా రక్షణ చట్టాలు కఠినతరం చేయాలి.

– డాక్టర్ బి.వాగ్దేవి, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

రక్షణ చట్టాలను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాల్సిందే..



వైద్యసిబ్బంది కోసం ప్రభుత్వాలు కొన్ని రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిందే. పని ప్రదేశంలో హౌస్ సర్జన్‌లు, పీజీ విద్యార్థులు, డ్యూటీ డాక్టర్లకు విశ్రాంత గదులు ఉండాలి. సీసీ కెమెరాలు తప్పనిసరి. కొన్నిచోట్ల 36 గంటల డ్యూటీ వేస్తున్నారు. 24 గంటల కంటే డ్యూటీ చేయడం కష్టం. సెక్యూరిటీని పెంచాలి. ప్రధానంగా మహిళా ఉద్యోగుల దగ్గర మహిళా భద్రత సిబ్బందిని ఉంచాలి. అప్పుడే మనిషికి మనిషి తోడు ఉన్నట్లు ఉంటుంది.

– డాక్టర్ బి.జగన్నాథరావు, సీనియర్ వైద్యాధికారి, రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ

పోలీస్ రక్షణ తప్పనిసరి



మహిళా డాక్టర్లకు రక్షణ కోసం ప్రభుత్వాస్పత్రుల్లో తప్పనిసరిగా పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటుచేయాలి. రాత్రిపూట ప్రమాదాల్లో గాయపడిన వారితో పాటు చాలామంది గుంపుగా వస్తుంటారు. అలాంటప్పుడు డాక్టర్లుగా పేషెంట్ పరిస్థితిని చూస్తామే తప్ప ఎవరు ఎలాంటి వారో గమనించలేం. పేషెంట్ విషయంలో సాయశక్తులా మెరుగైన వైద్యం అందిస్తాం. కానీ అనుకోని సంఘటన జరిగినప్పుడు మాత్రం పేషెంట్‌కి సంబంధించిన వారు డాక్టర్లను కొట్టడానికి కూడా వెనుకాడరు. పోలీస్ సెక్యూరిటీ ఉంటే ధైర్యంగా ఉంటుంది. పోలీసుల వద్ద ఉన్న ఆల్కహాల్ డిటెక్టర్ హాస్పిటల్స్‌లో కూడా ఉంచే ఏర్పాటు చేయాలి. సాలూరు సీహెసీలో డాక్టర్లకు డ్రెస్సింగ్ రూమ్స్, టాయిలెట్స్ సరిగా లేవు. ఒక డ్యూటీ డాక్టర్ ఉన్నప్పుడు అదర్ డిపార్ట్‌మెంట్ కేసు వచ్చినప్పుడు రాత్రిపూట సంబంధిత డాక్టర్ ఆస్పత్రికి వచ్చేందుకు ప్రభుత్వ వాహనం ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ రత్నకుమారి, సాలూరు సీహెచ్‌సీ

అనేక సమస్యలు అధిగమిస్తున్నాం..



ఆస్పత్రిలో ఏడుగురు మహిళా వైద్యాధికారిణులు ఉన్నారు. నేను ఏడాదిన్నరగా ఇక్కడ సేవలు అందిస్తున్నాను. 10 రోజులకోసారి 24 గంటల డ్యూటీ చేయాల్సి వస్తోంది. ఇందులో భాగంగా రాత్రి సమయాల్లో విధులు నిర్వహించడం సవాళ్లతో కూడిన విషయం. మద్యం సేవించి, ప్రమాదాల బారిన పడి వైద్యకోసం ఆస్పత్రికి వచ్చిన వారితో మరింత ఇబ్బందులు ఉంటున్నాయి. ఒకరు గుండె నొప్పితో వస్తే, మరొకరు మద్యం సేవించి రోడ్డు ప్రమాదం బారిన పడి వచ్చేవారు ఉంటారు. ఈ తరహా ఘటనలు రాత్రి సమయాల్లో అధికం. ప్రాధాన్యతకు అనుగుణంగా సేవలు అందించాలి. బాధితులు అర్థం చేసుకోలేక దాడులకు, గొడవలకు దిగుతారు. వారిని ఎలా అడ్డుకోగలం. ఈ తరహా ఘటనలు ఎన్నో చూశాను. రాత్రి సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. వైద్య విద్యార్థినులు, నర్సింగ్ విద్యార్థినులకు రక్షణ కల్పించాలి.

– పైలా భాగ్యశ్రీ, వైద్యాధికారి, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

అవుట్‌పోస్టు పెట్టాలి



రాత్రీ పగలు వివిధ ఆరోగ్య సమస్యలతో అనేక మంది ఆస్పత్రికి వచ్చేవారు ఉంటారు. ఒక రోగి వెంట పది మందికి పైగా సహాయకులు వస్తుంటారు. ఎవరి ధోరణి వారిదే. వచ్చేవారిలో కొంతమంది మద్యం సేవించిన వారు ఉంటారు. వివిధ రకాల మనస్తత్వం కలవారు వస్తారు. రాత్రి సమయంలో బెదిరించేవారూ లేకపోలేదు. కొందరి నడవడిక వల్ల మహిళా వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ ఇబ్బందులు పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు ఆస్పత్రి వద్ద పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేస్తే భద్రత ఉంటుంది.

– రావాడ జ్యోతి, డెర్మటాలజిస్టు, పాలకొండ ఏరియా ఆస్పత్రి

విశ్రాంతి గదులు ముఖ్యం



రోగి, క్షతగాత్రులతో వచ్చేవారు మాకు మ్మడిగా వైద్యసేవలు అందించే చోటుకు వస్తుంటారు. సేవలు అందించే క్రమంలో ఆలస్యమైనా, వారు అడిగిన ప్రశ్నలకు మా నుంచి వచ్చే సమాధానంగా వారికి నచ్చకపోయినా దాడులు, వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. వేల మంది రోగులు వచ్చే ఏరియా ఆస్పత్రి వద్ద పోలీస్ భద్రత అవసరం. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ భద్రత సిబ్బంది ఉన్నా ఫలితం లేదు. సహాయకులు వేచి ఉండేలా విశ్రాంత గదులు ఏర్పాటు చేయాలి. రోగితో పాటు వచ్చేపోయే వారి వివరాలు నమోదు చేయాలి. పోలీస్ బందోబస్తు నిత్యం సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఏర్పాటు చేయాలి.

– తాడంగి మహేశ్వరి, వైద్యాధికారిణి, ఏరియా ఆస్పత్రి

ఫిమేల్ అటెండర్ ఉండాలి



మహిళా డాక్టర్లతో పాటు ఒక ఫిమేల్ అటెండర్ ఆస్పత్రిలో తప్పనిసరిగా ఉండాలి. రాత్రిపూట అత్యవసర కేసులకు అటెండ్ అవ్వాల్సిన సమయంలో ట్రాన్స్‌పోర్టు వెహికల్ ఉండాలి. అందులో సెక్యూరిటీ ఉండాలి. వాచ్‌మన్‌తో పాటు పోలీస్ విభాగానికి సంబంధించిన వారు ఉంటే రాత్రిపూట సెక్యూరిటీ ఉంటుంది. ఏజెన్సీ ఏరియా కావడంతో పేషెంట్లతో వచ్చిన కొంతమంది తాగి ఉంటున్నారు. అలాంటి సమయంలో ఎమర్జెన్సీ కేసులు చూడాలంటే భయంగా ఉంటుంది. సెక్యూరిటీతో పాటు మహిళా అటెండర్ ఉంటే సహకారంగా ఉంటుంది. డ్రెస్సింగ్ రూమ్, బాత్ రూమ్ తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతం పాత భవనాల్లో అలాంటి సదుపాయాలు సరిగా లేవు.

– హిమబిందు, జూనియర్ డాక్టర్, మామిడి పల్లి పీహెచ్‌సీ, సాలూరు మండలం

ప్రతి ఫ్లోర్‌లో విశ్రాంతి గది అవసరం



నిత్యం వందలాది మంది రోగులకు సేవలందిస్తున్నాం. మా కష్టం కూడా గుర్తించాలి. అవసరమైన భద్రత కల్పించాలి. నర్సింగ్ సిబ్బందికి సంబంధించి విశ్రాంతి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంది. రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకోవాలంటే మూడు అంతస్తుల దిగి గ్రౌండ్ ఫ్లోర్‌కి రావాల్సి వస్తోంది. ఈ సమయంలో సిబ్బంది భయపడుతున్నారు. మహిళా నర్సింగ్ స్టాఫ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రతీ ఫ్లోర్‌లో భద్రతతో, పూర్తి వసతులతో కూడిన విశ్రాంతి గది ఏర్పాటు చేయాలి. ఈ గదుల వద్ద భద్రత కల్పించాలి.

– ఆర్.విజయకుమారి, హెడ్‌నర్స్, పాలకొండ, ఏరియా ఆస్పత్రి

ఆస్పత్రికి వచ్చేవారు బాధ్యతగా మెలగాలి



ఆస్పత్రికి వచ్చే బాధితులను కుటుంబ సభ్యులవలే సాకుతున్నాం. అటువంటిది మాపై దాడులు చేయడం సరికాదు. ఆస్పత్రి సిబ్బందికి భద్రత అవసరం. మూడు ఫ్లోర్లు ఉన్న ఆస్పత్రిలో భద్రతకు పది మంది సిబ్బంది ఉన్నారు. మరింత కట్టుదిట్టం చేయాలి. సీసీ కెమెరాల వ్యవస్థను వ్యవస్థను కట్టుదిట్టం చేయాలి.

– సోఫియా సొదామని, నర్సింగ్ సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

ఆయన చెప్పారు.. తీసేశాం అంతే!

- ఉద్యోగం కావాలంటే ఎమ్మెల్యే అనుమతితో రా..
- లేదంటే సెలవు పెట్టి వెళ్లిపో..
- 'ఆప్కాస్' అవుట్‌సోర్సింగ్ ఉద్యోగినిపై ప్రతాపం
- సీటు ఇవ్వక, పని చెప్పక వేధింపులు
- వైఎస్సార్‌సీపీ నేత బంధువు కావడమే నేరం?
- పార్వతీపురం పురపాలక సంఘ కార్యాలయంలో చిరుద్యోగినిపై అమానవీయం
- సామాజిక మాధ్యమాల్లోనూ వీడియోలు హల్‌చల్



పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం



మున్సిపల్ కార్యాలయం ఆవరణలో దీనస్థితిలో కూర్చొన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి సుమ

సాక్షి పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్: ఆమె ఒక చిరుద్యోగిని. పార్వతీపురం పురపాలిక సంఘ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్(ఆప్కాస్) ప్రాతిపదికన పని చేస్తోంది. కూటమి పెద్దలకే కడుపు మండిందో.. మున్సిపల్ అధికారులకు ఎటువైపు నుంచి ఒత్తిడి వచ్చిందోగానీ.. ఆడబిడ్డ అని జాలిచూపకుండా అమానవీయంగా రోడ్డున పడేశారు. ''సార్.. మీరు నాకు వర్క్ చెప్పడం లేదు. సీటు ఇవ్వడం లేదు. ఏ పనీ చేయడం లేదని తిరిగి అంటున్నారు. నాకు ఏమీ చెప్పకుండా, నన్ను మానేసి వెళ్లిపోవాలంటే ఎలా సార్? మానేయమనడం తప్ప.. ఇంకేదైనా చెప్పండి సార్.. చేస్తాను'' అంటూ ప్రాథేయపడుతున్నా కనికరించలేదు. నిస్సహాయ స్థితిలో గురువారం పార్వతీపురం పురపాలిక సంఘ కార్యాలయం ఆవరణలో మెట్లపై కూర్చొని తన దీనస్థితిని తలుచుకుంటూ కుమిలిపోయింది. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలితో పాటు.. కార్యాలయ వర్గాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

పార్వతీపురం పురపాలిక సంఘ కార్యాలయంలో పి.సుమ అనే మహిళా ఉద్యోగిని సుమారు ఏడు నెలల కిందట అవుట్ సోర్సింగ్(ఆప్కాస్) కింద విధుల్లో చేరారు. కొద్దిరోజులుగా ఆమెను విధుల నుంచి తప్పించాలని స్థానిక పెద్దల నుంచి ఒత్తిడి వస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ప్రత్యేకించి ఒక చోట సీటు ఇవ్వక.. ఏ పనీ అప్పగించక మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఈ వేధింపులు మరింత ఎక్కువైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల కిందట వీలైతే రాజీనామా చేయాలని, లేకుంటే దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లిపోవాలని ఒత్తిడి చేశారు. తాను తప్పు చేస్తే విధుల నుంచి తీసేయాలని.. ఏ కారణమూ లేకుండా ఎందుకు తప్పుకుంటానని ఆమె ప్రశ్నించారు. పై నుంచి తమపై ఒత్తిళ్లు వస్తున్నాయని కూడా ఆమె వద్ద చెప్పినట్లు సమాచారం. చివరికి సెలవు పెట్టేందుకు కూడా తను నిరాకరించడంతో మున్సిపల్ రెవెన్యూ అధికారి రూబెన్ విభాగానికి అప్పగించారు. అక్కడ కూడా అదే పరాభవం ఎదురైంది. 'నిన్ను తీసేయాలని పై నుంచి మాకు ఒత్తిళ్లు ఉన్నాయి. నువ్వు రాజీనామా చేసేయ్!' అంటూ ఓసారి.. 'మూడు నెలలు సెలవు పెట్టి వెళ్లిపో.. ఆ తర్వాత స్థానిక ఎమ్మెల్యేను కలిసి వచ్చాక చేరు..' అంటూ మరోసారి మున్సిపల్ ఆర్వో రూబెన్ ఆమెకు స్పష్టం చేశారు. అందుకు కూడా తనకు అభ్యంతరం లేదని సదరు మహిళా ఉద్యోగిని చెప్పినప్పటికీ.. ఏకంగా రాజీనామా చేయ్.. అంటూ మరలా ఒత్తిడి ప్రారంభించారు. చివరికి ఆగస్టు 1 నుంచి హాజరు పట్టీలో ఆయన అనుమతి లేకుండా ఆమె సంతకం పెట్టడానికి వీల్లేదంటూ రాసేశారు. తను మాత్రం క్రమం తప్పకుండా విధులకు హాజరవుతూ.. సంతకం పెడుతూనే వస్తోంది. దీంతో మరింత బెదిరింపులు ఎక్కువయ్యాయి. చేసేదిలేక కమిషనర్ శ్రీనివాస్ వద్ద ఆమె మొర పెట్టుకుంది. 'లైబ్రరీలో విధులకు పంపిస్తాను.. ఇష్టమైతే వెళ్లు' అంటూ ఆయన అనడంతో అందుకు కూడా ఉద్యోగిని అంగీకరించారు. అయితే, అందుకు సంబంధించి లిఖితపూర్వకంగానైనా, మౌఖికంగానైనా ఆదేశాలు కమిషనర్ ఇవ్వలేదు. లైబ్రరీలో విధుల్లో చేరేందుకు ఆమె వెళ్తే.. అక్కడ తీసుకునేందుకు వారు నిరాకరించారు. దీంతో మరలా కమిషనర్ వద్దకు వచ్చి మొర పెట్టుకుంటే.. అధికారికంగా ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పేశారు. వేధింపులకు గురవుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని సుమ.. వైఎస్సార్‌సీపీ నేత బంధువు కావడంతోనే ఈ విధంగా విధుల నుంచి తప్పించేందుకు ఒత్తిడి చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కమిషనర్ చెప్పారు.. తీసేశాం!

తనపై కమిషనర్ నుంచి ఒత్తిడి వచ్చినందువల్లే ఉద్యోగినిని విధుల్లో ఉంచడం లేదని మున్సిపల్ ఆర్వో రూబెన్ చెబుతున్నట్లు ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. తాను కూడా కమిషనర్ వద్ద పని చేస్తున్న సాధారణ ఉద్యోగేనని చెప్పారు. ఆయన ఏ పని చెబితే అదే చేస్తానని అందులో స్పష్టంగా ఉంది.

నాకు తెలియదు.. విచారణ చేస్తాం...

ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా... ఉద్యోగంలో నుంచి తీసేయాలని ఆర్వోకు చెప్పలేదని సమాధానమిచ్చారు. ఆయన ఎందుకు అలా అన్నారో తనకు తెలియదన్నారు. సదరు మహిళా ఉద్యోగిని కూడా ఎందుకు అలా మాట్లాడిందో తనకు తెలియదని.. రెండు రోజుల్లో విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జనవరి నాటికి ఓటరు నమోదు పూర్తి చేయాలి

- జేసీ ఎస్.ఎస్.శోభిక

పార్వతీపురం: జిల్లాలో ఇంటింటి ఓటరు సర్వే 2025 జనవరి నాటికి పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి జిల్లా అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదుపై సూచనలిచ్చారు. అనంతరం జిల్లా అధికారులో జేసీ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ వచ్చేఏడాది జనవరి 1 నాటికి జిల్లాలో 18 ఏళ్ల నిండిన వారిని యువ ఓటర్లుగా పేరు నమోదుచేయాలని సూచించారు. బూత్‌లెవెల్ అధికారులు సెప్టెంబర్ 21లోగా ఇంటింటి సర్వే పూర్తిచేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై బూత్‌లెవల్ అధికారులకు (బీఎల్‌ఓ), ఓటరు నమోదు అధికారులు, సహాయ నమోదు అధికారులకు అవసరమైన శిక్షణ ఇస్తామని తెలిపారు. చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించాలన్నారు. సాలూరు, పాలకొండలలో ఒకటి, రెండు శాతం నూతన ఓటరు నమోదు జరిగిందని, మిగిలిన నియోజకవర్గాల్లో నమోదు జరగలేదని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవ నాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు కె.హేమలత, వి.వి.రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాస్త పెరిగిన తోటపల్లి నీటిప్రవాహం


తోటపల్లి ప్రాజెక్టువద్ద పరిస్థితి

గరుగుబిల్లి: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటిప్రవాహం కాస్త పెరిగింది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద గురువారం సాయంత్రానికి 105 మీటర్ల లెవెల్‌కుగాను 104.52 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 2,650 క్యూసెక్కుల వరద నీరు రాగా అధికారులు రెండు గేట్లు ఎత్తివేసి 1,929 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువలద్వారా 3,019 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 2.213 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టువద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

కూలిన పూరిల్లు


కూలిపోయిన పూరింటి వద్ద ఆర్ఐ లక్ష్మనాయుడు, ఎంపీటీసీ వెంకటనాయుడు, బాధితులు

వీరఘట్టం: మండలవ్యాప్తంగా బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో భారీ వర్షం కురిసింది.ఈ వర్షం ధాటికి చలివేంద్రి గ్రామానికి చెందిన పోరెడ్డి సుబ్బారావు పూరిల్లు అర్ధరాత్రి కుప్పకూలిపోయింది. ఆ ఇంటిలో భార్య, ఇద్దరు పిల్లలతో సుబ్బారావు ఉంటున్నాడు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వారంతా భయపడి సమీపంలో ఉన్న బంధువుల ఇంటిలో పడుకునేందుకు వెళ్లారు. తెల్లవారాక ఇంటికి వచ్చి చూసేసరికి ఇల్లు మొత్తం కుప్పకూలిపోయింది. దీంతో పెద్దప్రమాదం నుంచి బయటపడ్డామంటూ సుబ్బారావు కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై ఎంపీటీసీ పోరెడ్డి వెంకటనాయుడు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్ఐ ఎస్.లక్ష్మనాయుడు, వీఆర్ఓ చక్రధర్ వచ్చి జరిగిన ప్రమాదాన్ని పరిశీలించారు. సుమారు రూ.50 వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

సెప్టెంబర్‌లో జిల్లాస్థాయి యువజనోత్సవాలు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు (సాంస్కృతిక పోటీలు) వచ్చే సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్నట్లు సెట్విజ్ సీఈఓ బి. రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు (15–29 వయస్సు) సంబంధిత పోటీల్లో పాల్గొనేందుకు తగిన శిక్షణతో సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. పోటీలు తేమిటిక్ థీమ్, ఇన్నోవేషన్ ఇన్ సైన్స్, సైన్స్ టెక్నాలజీ అంశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు (బృందం), జానపద గీతాలు (బృందం), జానపద నృత్యాలు (సోలో), జానపద గీతాలు (సోలో) పోటీలు ఉంటాయన్నారు. జీవిత నైపుణ్య విభాగంలో కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లరేషన్ (ప్రకటన). పోటీలు నిర్వహిస్తామన్నారు. యువ కృతి విభాగంలో హస్తకళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయస్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9849913080 లేదా 8247554334 నంబర్లను కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు రామతీర్థంలో సామూహిక కుంకుమార్చన

నెల్లిమర్ల రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి దేవస్థాన అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీరామ, లక్ష్మీ అష్టోత్తర పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. 11.30 గంటలకు శ్రీరామచంద్ర పట్టాభిషేకాన్ని జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారు. పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఆలయ సిబ్బందే పూజా ద్రవ్యాలను అందజేస్తారు. కుంకుమార్చనల నేపథ్యంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని మట్టి గాజులతో సుందరంగా ముస్తాబు చేశారు. పూజల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఈఓ వై.శ్రీనివాసరావు కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹216

అంతులేని విషాదం

- మృతుల స్వగ్రామాల్లో విషాదఛాయలు


భార్య సత్యవతితో ఆనందరావు(ఫైల్)


గొల్లపేటలో విషణ్ణవదనాల్లో మృతుడి బంధువులు

పూసపాటిరేగ/చీపురుపల్లిరూరల్ (గరివిడి): అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా పరిశ్రమలో బుధవారం జరిగిన దుర్ఘటనలో గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామానికి చెందిన మహంతి నారాయణరావు(34), పూసపాటిరేగ మండలంలోని గొల్లపేటకు చెందిన బమ్మిడి ఆనందరావు (38) ప్రాణాలు విడవడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబాల్లో ఉన్నతంగా చదువుకున్న వారు ఉద్యోగాలు చేస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండి నడిపించేవారని, కుటుంబసభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచివేసింది. ఎంఎస్సీ చదువుకున్న మహంతి నారాయణరావు 2020వ సంవత్సరంలో ఫార్మా కంపెనీలో ఉద్యోగం సంపాదించి అనతికాలంలోనే అదే కంపెనీలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. తల్లిదండ్రులు మహంతి సత్యం, బంగారమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా మృతుడు నారాయణరావు చిన్నవాడు. మృతుడికి భార్య స్వాతి, రెండేళ్ల వయస్సు గల కుమారుడు అనిషిత్ ఉన్నారు. కొడుకు మరణంతో తల్లిదండ్రులు, భర్త మరణంతో స్వాతి, కుమారుడు అనాథలుగా మిగిలారు. అలాగే విశాఖపట్నంలోని కూర్మన్నపాలెంలో నివసిస్తూ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఆనందరావు రాఖీ పండగరోజు గ్రామానికి వచ్చి అందరినీ కలిసి వెళ్లాడని గొల్లపేట గ్రామస్తులు వాపోయారు. ఇంతలో పేలుడు రూపంలో మృత్యువు కాటేసిందని భోరున విలపించారు. మృతుడికి భార్య సత్యవతి, కుమారులు కౌశిక్, మనోజ్, అన్నయ్య బమ్మిడి పోతయ్య ఉన్నారు.

సోంపురం వ్యక్తికి గాయాలు

వేపాడ: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో వేపాడ మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన జాగరపు ప్రకాశ్ గాయాలపాయ్యాడు. జాగరపు ప్రకాశ్ కొంతకాలంగా కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే బుధవారం ఫార్మాలో జరిగిన ప్రమాదంలో ప్రకాశ్ ముఖం, చేతులపై గాయాలయ్యాని బాధితుడి కుటుంబసభ్యులు తెలిపారు. ప్రస్తుతం అచ్యుతాపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ప్రకాశ్ భార్య మానస, తల్లి లక్ష్మి, తండ్రి రాము ఉన్నారు.


వేపాడ: గాయాలపాలైన ప్రకాశ్


మహంతి నారాయణరావు అలియాస్ సంతు


అర్తమూరులో మృతుడి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట..


పార్థసారథి (ఫైల్)

పార్వతీపురం టౌన్: మరి కొద్దిరోజుల్లో ఆ ఇంట పెళ్లి బాజాలు మోగాల్సి ఉంది. ఇప్పటికే బంధువర్గాలకు పిలుపులు, పెళ్లికి కావాల్సిన సరంజామా సమకూర్చుకోవడంలో వధూవరుల కుటుంబాలు నిమగ్నమయ్యాయి. ఇంతలోనే విధికి కన్ను కుట్టింది. త్వరలో పెళ్లి కొడుకు కావాల్సిన పార్వతీపురం మండలం డోకిశీల పంచాయతీ చలమవలస గ్రామానికి చెందిన జవ్వాది కోటేశ్వరరావు కుమారుడు పార్థసారథి(26) అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ వార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కంటికీమింటికీ ఏకధారగా రోదించారు. సెప్టెంబరు 4న పార్థసారథి వివాహాన్ని కుటుంబసభ్యులు నిశ్చయించారు. పార్థసారథి మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుంటుబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన జవ్వాది పార్థసారథి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సాయం అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. పరామర్శలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ బాధితులకు అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనువానరావు

చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్(గరివిడి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం రియాక్టర్ పేలిన దుర్ఘటన చాలా దురదృష్టకరమైందని, ఆ ప్రమాద బాధితులకు తాము అండగా ఉంటామని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన 17 మందిలో విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఒకరు దుర్మరణం చెందారని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాల పట్ల ఉదారంగా స్పందించాలని కోరారు. విశాఖలో ఎల్‌జీ పాలిమర్స్ దుర్ఘటన సమయంలో నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ఉదారంగా స్పందించిన విధానం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం గొప్ప విషయమని, మిగిలిన బాధిత కుటుంబాలకు వైద్యం ఇతరత్రా సదుపాయాలు కల్పించారని గుర్తుచేశారు. ఆ మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నానన్నారు. ఎసెన్షియా దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే డిమాండ్ చేశారని, ఆ మేరకు ఈరోజు చంద్రబాబు ప్రభుత్వం ఆదుకుంటామని ప్రకటించిందన్నారు. బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇండోర్ స్టేడియం సిద్ధం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: స్థానిక విజ్జీ స్టేడియంలో సీపీడబ్ల్యూ పథకం కింద సుమారు రూ.6 కోట్లతో నిర్మించిన బహుళ ప్రయోజన ఇండోర్ స్టేడియంను త్వరగా సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు ఇండోర్ స్టేడియం నిర్మాణంపై కలెక్టర్ తన చాంబర్‌లో గురువారం సమీక్షించారు. దీని నిర్మాణం దాదాపు పూర్తయిందని, సుమారు రూ.10 లక్షలతో చిన్న చిన్న మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉందని డీఎస్‌డీఓ వెంకటేశ్వర్రావు కలెక్టర్ తెలిపారు. మరమ్మతులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని అమ్మవారి పండగ నాటికి స్టేడియాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.20 లక్షల బిల్లుల మంజూరు కోసం శాప్‌కు రాయాలని సూచించారు. స్టేడియం వద్ద వెంటనే బోరు తవ్వించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని విద్యుత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వర్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, సీపీడబ్ల్యూ జేఈ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మానాపురం వంతెన ఐదు నెలల్లో పూర్తికావాలి

జిల్లాలోని దత్తిరాజేరు మండలం మానాపురం రైల్వే గేటు వద్ద రాయ్‌పూర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం వచ్చే జనవరి నెలాఖరు నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తికావాలని కలెక్టర్ ఆదేశించారు. వంతెన నిర్మాణం పురోగతిపై ఇకపై ప్రతి నెలా నిర్మాణ సంస్థతోను, జాతీయ రహదారుల సంస్థ ఇంజినీర్లతోను సమీక్ష నిర్వహిస్తామన్నారు. నిర్మాణ సంస్థ హామీ ఇచ్చిన విధంగా వచ్చే జనవరి నాటికి పనులు పూర్తికానట్లయితే సంస్థను బ్లాక్ లిస్టులో ఉంచాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో కన్సల్టెంట్ సంస్థ టీమ్ లీడర్ బాపన్న శెట్టి, జాతీయ రహదారుల సంస్థ ఈఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఈఈ బాలకృష్ణ, డీఈ కేవీ నరసింహారావు, ఏఈ మురళీబాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- మెయిన్‌రోడ్డు మీదుగానే ట్రాక్టర్ల రాకపోకలు
- సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు


ట్రాక్టర్‌లోకి కంకరను లోడ్‌చేస్తున్న జేసీబీ

బొబ్బిలిరూరల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రావెల్, ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. శని, ఆదివారాల్లో రాత్రిపూట జరిగే ఈ తంతు ఇప్పుడు తొండముదిరి ఊసరవెల్లి అయినట్టుగా పట్టపగలే అధికారపార్టీ అండదండలతో తవ్వకాలు జరుపుతున్నారు. బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయానికి కూతవేటు దూరంలో గత రెండు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. మెట్టవలస గ్రామ సమీపంలోను, గ్రోత్ సెంటర్‌కు చివరన రాళ్లక్వారీ ఉంది. దీనిని ఇప్పటికే తొలిచేశారు. ఇప్పుడు అక్కడున్న కంకరను తవ్వేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి గ్రావెల్ తవ్వకాలను మొదలుపెట్టారు. 6 ట్రాక్టర్లు, ఒక జేసీబీ సాయంతో మట్టితవ్వి తరలించేస్తున్నారు. లోడు దాదాపు రూ.1500కు విక్రయిస్తున్నారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చూసొచ్చి తవ్వకాలకు అనుమతులున్నాయని చెప్పొకొచ్చారు. క్వారీలో రాయి తవ్వకానికి అనుమతిచ్చారే తప్ప, ఆ చుట్టుపక్కల ఉన్న కంకరను తవ్వేందుకు అనుమతులెవరిచ్చారని ప్రశ్నిస్తే మాట మార్చుతున్నారు. అక్రమగ్రావెల్ తవ్వకాలకు అధికారపార్టీ వారికి రెవెన్యూ అధికారులే అక్రమంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూగర్భగనుల శాఖ ఎవరికి, ఎలాంటి అనుమతిలిచ్చిందో ఉన్నతాధికారులు తేల్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరకు సకాలంలో ఇసుకను వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలను చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక సరఫరా పథకంలో అవసరమైన వారికి సరఫరా చేయనున్నామన్నారు. జిల్లాలోని భామిని మండలంలో కాట్రగడ్డ ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తీసేందుకు అవసరమైన అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఇసుక తీసేందుకు చార్జీలు, రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేసి ఇసుక అందించనున్నారని చెప్పారు.

25న లక్‌పతి దీదీ

ఈనెల 25న డ్వాక్రా మహిళా సంఘాలకు లక్‌పతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పీఎం నరేంద్ర మోదీ మధ్యప్రదేశ్‌లో ప్రారంభించే ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపిక చేసిన డ్వాక్రా మహిళలకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 406 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.56కోట్లు చెక్కుల రూపంలో అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి.కేశవనాయుడు, ఆర్డీఓలు కె.హేమలత, వీవీ రమణ, డీపీఓ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు గ్రామసభలు

- నేడు అన్ని పంచాయతీల్లో నిర్వహణ
- 2025–26లో చేపట్టే పనులపై నిర్ణయం

విజయనగరం ఫోర్ట్: వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఈ పథకం అమల్లోకి రాకముందు ఉపాధి కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజల వలసలను తగ్గించేందుకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద సొంత గ్రామంలోనే పనులు కల్పిస్తారు. ఉపాధి పనులు గుర్తించేందుకు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. గతంలో గ్రామసభలు రోజుకో గ్రామంలో జరిగేవి. ఈసారి జిల్లా వ్యాప్తంగా ఒకేరోజున అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తారు. ఏయే రకం పనులు ఎక్కడెక్కడ నిర్వహించాల్సి ఉంటుందని అంచనా వేసి పంచాయతీల్లో తీర్మానం చేసి మండల పరిషత్‌కు పంపిస్తారు. అక్కడ ఆమోదం పొందిన తర్వాత జిల్లా పరిషత్‌కు పంపిస్తారు. అక్కడినుంచి కలెక్టర్‌కు అడ్మిన్ అప్రూవల్ కోసం పంపిస్తారు.

ఒకేరోజున గ్రామసభలు

ఈఏడాది అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేరోజున గ్రామ సభలు నిర్వహించనున్నాం. గ్రామసభల్లో ఆయా పంచాయతీల్లో చేపట్టే పనులను గుర్తించనున్నాం.

అరుణశ్రీ, ఇన్‌చార్జి పీడీ, డ్వామా


ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం

- జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

పార్వతీపురం: ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మండల వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థకు సంయుక్తంగా నిర్వహించిన జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల లాభాలు, సాగు విధానాలు, నవధాన్యాల సాగు వల్ల ఉపయోగాలు తదితర అంశాలపై వర్క్‌షాప్‌లో చర్చించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో మాట్లాడుతూ రైతులను సంపన్నులుగా మార్చడమే లక్ష్యంగా వ్యవసాయ విధానాలు రూపొందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు, రాబడి వివరాలు నమోదుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెంచాలని, ప్రతి రైతు సేవాకేంద్రాల పరిధిలో కనీసం ఒక ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం ఏడీఏ టి.వెంకటేష్, కె.శ్రీనివాస్, డి.భరత్, పాలకొండ ఏడీఏ కె. రత్నకుమారి, సాలూరు ఏడీఏ ఎం.మధుసూదన్, గుమ్మలక్ష్మీపురం ఏడీఏ నిర్మలాజ్యోతి, మండల వ్యవసాయ అధికారులు, కమ్యూనిటీ సహజ వ్యవసాయాన్ని నిర్వహించే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధికి చెందిన పిల్లేన దుర్గాప్రసాద్(17) విద్యుత్ షాక్‌తో గురువారం మృతిచెందాడు. ఈ సంఘటనపై సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దుర్గాప్రసాద్ ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్తూ అక్కడ ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోగా షాక్‌కొట్టడంతో కేకలు వేశాడు. దీంతో తండ్రి గంగరాజు వచ్చి కర్రతో కొట్టి రాడ్డునుంచి దుర్గాప్రసాద్‌ను వేరుచేశాడు. అప్పటికే ఆపస్మారక స్థితికి చేరుకున్న కుమారుడిని తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన మృతదేహాన్ని చూసి, ఆ కుటుంబాన్ని ఓదార్చారు.

బలిజిపేటలో వరొకరు..



పార్వతీపురంటౌన్/బలిజిపేట: బలిజిపేట మండలంలోని మిత్తివలస గ్రామ సమీపంలో బుధవారం రాత్రి విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని గాజుల వలస గ్రామానికి చెందిన ఎన్.శంకర్రావు (21) విద్యుత్ పనులు చేస్తుండగా నడిమింటి వారి చెరువు వద్ద ఎలక్ట్రికల్ పోల్‌కు విద్యుత్ సరఫరా అవడంతో షాక్ కొట్టి మృతి చెందాడు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. గురువారం ఉదయాన్నే పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ..

బొబ్బిలిరూరల్: మండలంలోని విజయపురిగ్రామానికి చెందిన జిన్ని గౌరమ్మ(45) పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ విషయమై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గౌరమ్మ ఈనెల 17న భర్తతో గొడవపడి రాత్రి 11గంటల సమయంలో మనస్తాపంతో పురుగు మందు తాగేసింది. విషయం తెలుసుకున్న భర్త ఆమెను బొబ్బిలి సీహెచ్‌సీలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి వైద్యులు రిఫర్‌చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మృతి చెందిందని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

బాల్య వివాహం అడ్డగింత

వంగర: మండల పరిధి అరసాడలో బాల్యవివాహాన్ని అధికారులు గురువారం అడ్డుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన బాలికకు అరసాడ గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.సన్యాసమ్మ, హెడ్‌కానిస్టేబుల్ వావిలపల్లి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వేణు, వీఆర్‌వో ఈశ్వరరావులు వివాహం జరిగే స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి వివాహం నిలుపుదల చేశారు. ఇరుపక్షాల తల్లిదండ్రులకు వంగర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై షేక్ శంకర్ కౌన్సెలింగ్ ఇచ్చి బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. వివాహం చేయబోమని వధూవరుల తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు.


గ్రామంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు